# అందరూ అంతే

డా.డి.శశికుమార్

ఆదివారం మధ్యాహ్నం భోజనం ముగించుకుని చతుర్ముఖ పారాయణానికి బయలుదేరాను స్నేహితుడి ఇంటికి.

సిటీ బస్సులో సీటు దొరికినందుకు ఆనందిస్తూ కిటికీలోంచి బయటకు చూస్తున్న నేను రోడ్డుకు అవతలివైపు ఉన్న బస్టాండులో నించుని ఉన్న మా అమ్మాయి రాధని చూసి ఆశ్చర్యపడ్డాను.

''స్పెషల్ క్లాసులు వున్నాయి — సాయంత్రం వరకూ రాను'' అని చెప్పి వెళ్ళిన రాధ ఈ టైమ్‌లో అలా బస్టాండులో కనిపించడం — నా మనసులో ఏదో మూల కొంచెం అనుమానం చోటు చేసుకోవడానికి దోహదమయింది.

అవును మరి ఎంతైనా వయసులో వున్న ఆడపిల్ల. నా కూతురని చెప్పుకోవడం కాదు కానీ రాధ అందగత్తెలలోనే లెక్క. అసలే రోజులు బాగాలేవు. నా మనసులో ఏవేవో ఆలోచనలు కదలాడుతున్నాయి. ఎలాగో వాటిని అదుపులో పెట్టి ఆరోజు కార్యక్రమం ముగించుకుని సాయంత్రానికి ఇల్లు చేరాను. అప్పటికే రాధ ఇంట్లో ఉంది. వాళ్ళ అమ్మకి వంటలో సాయం చేస్తోంది.

అమ్మాయిని నిలదీసి అడగడమా, వద్దా — తర్జన, భర్జన. చిన్నప్పటినుంచీ ఎంతో కట్టుదిట్టాలతో పెంచిన మా అమ్మాయి — ఈరోజు తప్పటడుగు వేస్తుందా? నాకు అప్రదిష్ట తెచ్చే పని రాధ ఎప్పటికీ చెయ్యదు అని ఎంత సర్ది చెప్పుకుందామనుకున్నా, మధ్య తరగతి కుటుంబీకుడుగా, అందునా ఇద్దరమ్మాయిల తండ్రిగా నా ఆందోళన సబబూ, సముంజసమూ అనే అనిపిస్తోంది.

ఇలాంటి ఆలోచనల తరువాత ఒక నిర్ణయానికి వచ్చి ఆరోజుకి ఏం మాట్లాడకుండా ఊరుకున్నాను.

రాత్రి మా ఆవిడకి జరిగిన సంగతి చెబితే 'మీకెప్పుడూ లేనిపోని అనుమానాలే — ఇప్పుడు అదేం తప్పు చేసిందని'' అని విసుక్కుని హాయిగా పడుకుంది. నా కంటికి మాత్రం ఆ రాత్రి నిద్ర వస్తే ఒట్టు.

పది రోజులలో డిగ్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న రాధ మర్నాడు పొద్దున్న కూడా స్పెషల్ క్లాసులంటూ కాలేజీకి వెళ్ళిపోయింది.

నేను మాత్రం ఆఫీసుకి సెలవుపెట్టి ముందు రోజు మా అమ్మాయి కనిపించిన బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నాను. ఆ బస్‌స్టాప్‌కి ఎదురుగా రోడ్డు అవతల ఓ చెట్టు వెనక నించున్నాను. నా చేతిలో ఓ పత్రిక వుంది. కానీ నా చూపులన్నీ బస్‌స్టాప్ దగ్గరే — అక్కడ ఉన్న జనాల మీదే.

ఇంతలో ఓ బస్సు వచ్చి ఆగింది. అందులోంచి దిగింది రాధ. ఒకసారి అటూ, ఇటూ చూసి బస్‌స్టాప్ దగ్గర నిలుచుంది. నా గుండె వేగంగా కొట్టుకోవడం, నా ఒళ్ళంతా చెమటలు పోయడం మొదలయింది. ఏం చెయ్యాలో ఆలోచించే స్థితిలో లేను నేను.

అంతలోనే ఓ యువకుడు మారుతీ కారు ఆ బస్‌స్టాప్ దగ్గర ఆపడం, నవ్వు ముఖంతో మా అమ్మాయి చెయ్యి ఊపుతూ కారు ముందు సీట్లో కూర్చోడం, ఆ కారు వేగంగా దూసుకు పోవడం — కలలో లాగా జరిగిపోయాయి. అంతా చూసిన నా ముఖం మాత్రం పాలిపోయింది.

ఆ తరువాత నేను మా అమ్మాయిని నిలదీసి అడగడం, ఆమె చెప్పిన సమాధానాలు నాకు నచ్చకపోవడం — అవన్నీ — మామూలుగా జరిగిపోయాయి. ''మాధవ్'' అదే — ఆ మారుతీ కారు అబ్బాయి తనని గాఢంగా ప్రేమిస్తున్నాడనీ, తప్పకుండా పెళ్ళి చేసుకుంటాడనీ రాధ ఎంత చెప్పినా, అంత కారులో షికార్లు తిరిగే అబ్బాయి మధ్య తరగతికి చెందిన మా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడంటే నాకు నమ్మబుద్ధి కాలేదు.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకే రాధకి మరో ''మంచి'' సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యడం అన్నీ జరిగిపోయాయి. కొన్నాళ్ళకి ఈ ప్రేమ — గీమా అన్నీ మరిచిపోయి సుఖంగా సంసారం చేసుకుంటుంది అని నా నమ్మకం. అప్పటికి కానీ నా మనసు కుదుటపడలేదు.

ఆ రోజు — ఇంట్లో ఒక్కడినే వున్నాను. మా ఆవిడ ఏవో పూజలు అని చెప్పి గుడికి వెళ్ళింది. మా ఇంటి ముందు ఆగిన మారుతీ కారు లోంచి దిగిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

ఆమె ఎవరో కాదు — సంధ్య. అవును. ఒకప్పటి 'నా' సంధ్య. నేను గాఢంగా ప్రేమించిన సంధ్య. ఎన్నేళ్ళయింది సంధ్యను చూసి! కనీసం పాతికేళ్ళు. అయినా ఆమె ముఖంలో పెద్దగా మార్పు లేదు. వయసు తెచ్చే కళ్ళజోడు, కొద్దిగా నెరసిన ముంగురులు తప్ప.